క్లుప్తంగా...

తొలిరోజు సెట్ ప్రశాంతం

ఉస్మానియా యూనివర్సిటీ: టీఎస్‌సెట్‌–2023 తొలి రోజు ప్రశాంతంగా ముగిసినట్లు అధికారులు పేర్కొన్నారు. శనివారం రాష్ట్ర వ్యాప్తంగా 35 కేంద్రాలలో జర్నలిజం, మేనేజ్‌మెంట్, లైఫ్ సైన్సెస్ సబ్జెక్టులకు జరిగిన మొదటి విడత పరీక్షకు 76.85 శాతం, రెండో విడత పరీక్షకు 81.20 శాతం హాజరైనట్లు వివరించారు. టీఎస్‌సెట్‌–2023 చైర్మన్, ఓయూ వీసీ ప్రొ.రవీందర్ మొదటి విడత పరీక్ష ప్రశ్నపత్రం కోడ్‌ను విడుదల చేసినట్లు తెలిపారు. ఈ నెల 30 వరకు సెట్ పరీక్షలు జరుగనున్నాయి.

బీసీ సీఎం ప్రకటన హర్షణీయం

ఉస్మానియా యూనివర్సిటీ: బీసీల పక్షపాతి బీజేపీ అని ఆ పార్టీ యువ నాయకులు, ఓయూ జేఏసీ చైర్మన్ ఎనుగంటి రాజునేత పేర్కొన్నారు. పార్టీలో బీసీలకు పెద్దపీట వేయడంతో పాటు ఏకంగా తెలంగాణ రాష్ట్రానికి సీఎంగా బీసీని ప్రకటించడం చరిత్రలో నిలిచిపోతుందన్నారు. గత 75 ఏళ్లలో ఏ ఒక్క పార్టీ కూడా బీసీని ముఖ్యమంత్రిగా ప్రకటించలేదన్నారు. సూర్యాపేట సభలో అమిత్ షా బీసీ నేతను సీఎంగా ప్రకటించడం పట్ల హర్షం వ్యక్తం చేశారు.

డాక్టరేట్ ప్రదానం


యాకోబ్

ఉస్మానియా యూనివర్సిటీ: ఓయూ క్యాంపస్ ఇంజినీరింగ్ కాలేజీ మెకానికల్ ఇంజినీరింగ్ విభాగంలో కొలిపాక యాకోబ్‌కు పీహెచ్‌డీ డాక్టరేట్ డిగ్రీ లభించింది. ఐఐసీటీ చీఫ్ సైంటిస్ట్ డాక్టర్ రాధాకృష్ణ, ఓయూ మెకానికల్ ఇంజినీరింగ్ విభాగం విశ్రాంత అధ్యాపకులు డాక్టర్ ఎంఎ ప్రసాద్ పర్యవేక్షణలో పర్‌ఫామెన్స్ ఎవాల్యుయేషన్ ఆఫ్ సోలార్ కుక్కర్ యూజింగ్ ఎనర్జీ అండ్ ఎనర్జీ ఎనాలసిస్ అనే అంశంపై పరిశోధనకు డాక్టరేట్ డిగ్రీ లభించినట్లు అధికారులు తెలిపారు.

ఓయూలో పుస్తక ప్రదర్శన

ఉస్మానియా యూనివర్సిటీ: ఓయూలోని యూనివర్సిటీ లైబ్రరీ ఆధ్వర్యంలో జరిగిన ఐక్య రాజ్య సమితి (యూఎన్‌వో) 78వ ఆవిర్భావ దినోత్సవాన్ని ఘనంగా నిర్వహించారు. శనివారం ఏర్పాటు చేసిన పుస్తక ప్రదర్శనను ముఖ్యఅతిథిగా హాజరైన రిజిస్ట్రార్ ప్రొ.లక్ష్మీనారాయణ ప్రారంభించారు. ఈ కార్యక్రమంలో ఇన్‌చార్జి లైబ్రేరియన్ డాక్టర్ చక్రవర్తి, అధ్యాపకులు డాక్టర్ యాదగిరి, డాక్టర్ అనీల కుమారి పాల్గొని ప్రసంగించారు.

ఆకట్టుకున్న గజల్ కచేరి



సనత్‌నగర్: బేగంపేట్‌లోని హైదరాబాద్ పబ్లిక్ స్కూల్‌లో ప్రముఖ గజల్ సంగీతకారుడు తలత్ అజీజ్ మ్యూజికల్ గజల్ కచేరి అందరిని ఆకట్టుకుంది. ఈ సంగీత కచేరి ప్రదర్శన చూసేందుకు పెద్ద ఎత్తున ప్రేక్షకులు హాజరయ్యారు. పబ్లిక్ స్కూల్ శతాబ్ది ఉత్సవాల్లో భాగంగా జాగిర్దార్ కాలేజ్, ది హైదరాబాద్ పబ్లిక్ స్కూల్ ఓల్డ్ స్టూడెంట్స్ అసోసియేషన్ ఆధ్వర్యంలో నిర్వహించిన ఈ కార్యక్రమంలో పాఠశాల పూర్వ విద్యార్థి తలత్ అజీజ్ గజల్ పాటలతో ఆ ప్రాంతం ఉర్రూతలూగింది.

వృద్ధుడి అదృశ్యం


పెంటయ్య

లాలాపేట: వాకింగ్‌కు వెళ్లిన ఓ వృద్ధుడు అదృశ్యమైన సంఘటన ఉస్మానియా యూనివర్సిటీ పోలీస్ స్టేషన్ పరిధిలో చోటు చేసుకుంది. ఏఎస్సై ఆర్. భిక్షపతిరావు తెలిపిన వివరాల ప్రకారం..హబ్సిగూడ కాకతీయ నగర్‌లోని సూర్యకృష్ణ రెసిడెన్సీలో వాచ్‌మెన్‌గా పని చేస్తున్న నాగరాజు అనే వ్యక్తి తండ్రి పెంటయ్య (75) ఈ నెల 25న వాకింగ్‌కు వెళ్లి ఇంటికి రాలేదు. తెలిసిన వారితో ఆరా తీసినా ఫలితం లేకపోవడంతో నాగరాజు పోలీసులకు ఫిర్యాదు చేశాడు.

మహిళ ఆత్మహత్య


రజని(ఫైల్)

రాంగోపాల్‌పేట్: ఆర్థిక ఇబ్బందులతో ఓ మహిళ ఉరివేసుకుని ఆత్మహత్యకు పాల్పడిన ఘటన మార్కెట్ పోలీస్ స్టేషన్ పరిధిలో జరిగింది. పోలీసుల వివరాల ప్రకారం.. ఆదయ్యనగర్‌లోని గాస్మండిలో రమేష్, భార్య రజని(49), కుమారుడితో కలిసి ఉంటున్నారు. రమేష్ గత కొన్ని ఏళ్ల నుంచి బ్రెయిన్ కేన్సర్‌తో బాధపడుతూ మంచానికే పరిమితమయ్యాడు. ఓ ప్రైవేటు బ్యాంక్‌లో అటెండర్‌గా పనిచేసే రజని మూడు నెలల నుంచి ఉద్యోగానికి వెళ్లకుండా భర్త బాగోగులు చూసుకుంటూ ఉంటుంది. ఆర్థిక ఇబ్బందులు చుట్టుముట్టడంతో ఏమి చేయలేని పరిస్థితుల్లో శుక్రవారం రాత్రి ఉరివేసుకుని ఆత్మహత్య చేసుకుంది. చుట్టుపక్కల వారు గమనించి గాంధీ ఆస్పత్రికి తరలించగా అప్పటికే మరణించినట్లు వైద్యులు తెలిపారు.

శాంతి భద్రతల్లో తెలంగాణ అగ్రస్థానం


మాట్లాడుతున్న మంత్రి తలసాని శ్రీనివాస్‌యాదవ్

సనత్‌నగర్: సేవకు మారుపేరు ఆర్యవైశ్యులు అని మంత్రి తలసాని శ్రీనివాస్‌యాదవ్ అన్నారు. శనివారం వెస్ట్ మారేడ్‌పల్లిలో తన నివాసం వద్ద కలిసిన సనత్‌నగర్ నియోజకవర్గ ఆర్యవైశ్య ప్రముఖుల సమావేశంలో మంత్రి మాట్లాడారు. వాసవి క్లబ్ ఇతర సంస్థల ద్వారా వైశ్యులు నిర్వహించే సేవా కార్యక్రమాలు స్ఫూర్తి దాయకమన్నారు. ఆర్యవైశ్యులకు రాజకీయంగా అధిక ప్రాధాన్యం కల్పించింది బీఆర్ఎస్ పార్టీయే అన్నారు. ఎమ్మెల్యే, ఎమ్మెల్సీ, కార్పొరేషన్, మున్సిపల్ చైర్మన్లుగా ఆర్యవైశ్యులకు అవకాశం కల్పించిన విషయాన్ని గుర్తు చేశారు. ఆర్యవైశ్యులు తలపెట్టే అన్ని కార్యక్రమాలకు తన సహకారం అందిస్తూ వచ్చానన్నారు. నియోజకవర్గ పరిధిలోని పలు దేవాలయ కమిటీలలో ఆర్యవైశ్యులకు తగిన ప్రాతినిధ్యం కల్పించామన్నారు. ఈ సమావేశంలో ఆర్యవైశ్య సంఘం ప్రతినిధులు సోమా ఆనంద్, ఐతా రాములు, జగదీష్, వెంకటనారాయణ, నాగమణి, యాదగిరి, బాస్కర్, శిరీష, ప్రకాష్ పాల్గొన్నారు.

- గుజరాతీ, జైన్, రాజస్థానీ, బెంగాలి తదితర సమాజ్‌లకు చెందిన ప్రతినిధులతో జరిగిన సమావేశంలో మంత్రి మాట్లాడారు. వివిధ రాష్ట్రాల నుంచి వచ్చి ఇక్కడ స్థిరపడిన వారికి కూడా తమ బిడ్డలుగానే భావించి ముఖ్యమంత్రి కేసీఆర్ నాయకత్వంలోని తెలంగాణ ప్రభుత్వం కడుపులో పెట్టుకొని చూసుకుంటుందన్నారు. శాంతి భద్రతల పరంగా తెలంగాణ రాష్ట్రం దేశంలోనే అగ్రస్థానంలో ఉందన్నారు. ఎలాంటి ఇబ్బందులు లేకుండా అన్ని వర్గాల ప్రజలు ఎంతో సంతోషంగా ఉన్నారన్నారు. గుజరాతి, జైన్, రాజస్థానీ, బెంగాలి తదితర సమాజ్‌లకు చెందిన వారికి కూడా అందుబాటులో ఉంటూ వారు ఎదుర్కొంటున్న అనేక సమస్యలను పరిష్కరించిన విషయాన్ని గుర్తు చేశారు. ఈ సమావేశంలో మోతీలాల్, శంకర్ శర్మ, జగదీష్‌ప్రసాద్, గులాబ్‌సింగ్, ఉత్తమ్ కుమార్ రాజ్ పురోహిత్, సురేష్ జగ్‌నాని, చైన్ సింగ్, యేగేష్, హిమాన్షు బాప్నా, థామస్ జాన్, రాం నివాస్ పాల్గొన్నారు.

బీఆర్ఎస్‌లో చేరిక..

సనత్‌నగర్ నియోజకవర్గ పరిధిలోని పలువురు బీజేపీ నాయకులు బీఆర్ఎస్‌లో చేరగా వారికి మంత్రి పార్టీ కండువాలు కప్పి పార్టీలోకి ఆహ్వానించారు. మహంకాళి జిల్లా బీజేపీ కన్వీనర్ సురేందర్, అమీర్‌పేటకు చెందిన తోజారాం సోద్రి, సుమీర్‌సింగ్ రాజ్ పురోహిత్, ధర్మిసంది కుమావత్ బీఆర్ఎస్‌లో చేరారు. ఈ కార్యక్రమంలో అత్తిలి శ్రీనివాస్‌గౌడ్, గులాబ్‌సింగ్ రాజ్ పురోహిత్ పాల్గొన్నారు.

ఓట్లు అడిగే హక్కు మాకే ఉంది

లాలాపేట: యాభై ఏళ్లలో గత పాలకులు చేపట్టని ఎన్నో అభివృద్ధి పనులను బీఆర్ఎస్ ప్రభుత్వం ఏర్పాటైన తర్వాతే పూర్తి చేశామని ప్రజలను ఓట్లు అడిగే హక్కు మాకే ఉందని సికింద్రాబాద్ బీఆర్ఎస్ అభ్యర్థి, డిప్యూటీ స్పీకర్ పద్మారావు గౌడ్ అన్నారు. తార్నాక డివిజన్ లాలాపేట, ఇసుకబాయి, వినోభానగర్, నఫీజ్ గార్డెన్, ఆర్యనగర్ తదితర ప్రాంతాల్లో డిప్యూటీ మేయర్ మోతే శ్రీలతా శోభన్‌రెడ్డి, ఇతర కార్పొరేటర్లతో కలిసి ప్రచారం నిర్వహించారు. ముందుగా ఇసుకబాయి వద్ద ఉన్న మహనీయులు అంబేడ్కర్, జగ్జీవన్‌రామ్ విగ్రహాలకు నివాళి అర్పించారు. ఇంటింటికి వెళ్లి ఓటర్లను కలిసి కారు గుర్తుకు ఓటేయాలని అభ్యర్థించారు. ఈ కార్యక్రమంలో మోతే శోభన్‌రెడ్డి, ఇసుకబాయి సంక్షేమ సంఘం అధ్యక్షులు గంధమల్ల రాజలింగం, బండెల స్వామి, కూరెల్లి నాగరాజుగౌడ్, సునీల్ ముదిరాజ్, మల్లికార్జున్, నాగేశ్వర్‌రావు, కృష్ణవేణి స్టాలీన్, పద్మ, ఎర్ర శ్యామ్, పర్శరాములు పాల్గొన్నారు.


ఎన్నికల ప్రచారంలో పద్మారావు గౌడ్

అధికార దుర్వినియోగం చేస్తే సహించం


మాట్లాడుతున్న కాంగ్రెస్ నాయకులు

రాంగోపాల్‌పేట్: అధికారాన్ని అడ్డుపెట్టుకుని దుర్వినియోగం చేస్తే సహించేది లేదని కాంగ్రెస్ పార్టీ రాంగోపాల్‌పేట్ డివిజన్ అధ్యక్షులు మల్లికార్జున్ హెచ్చరించారు. శనివారం ఆవులమందలోని పార్టీ కార్యాలయంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. జీహెచ్ఎంసీ అధికారులు, కొందరు పోలీసులు తమ పార్టీ కార్యాలయానికి వచ్చి పోలింగ్ బూత్‌కు దగ్గరలో ఉందని వెంటనే మూసివేయాలని బెదిరిస్తున్నారని ఆరోపించారు. నిబంధనల ప్రకారం ఎన్నికల బూత్‌కు కార్యాలయం ఎంత దూరంలో ఉందో కొలిచి నోటీసులు ఇచ్చిన తర్వాత మూసివేయాలని ఆదేశించాల్సి ఉంటుందని కానీ.. అధికార పార్టీ నాయకుల ఒత్తిడితో అధికారులు, పోలీసులు బలవంతంగా పార్టీ కార్యాలయాన్ని మూసివేయించాలని కుట్రలు పన్నుతున్నారని విమర్శించారు. శుక్రవారం కాంగ్రెస్ పార్టీ పాదయాత్రలో పాల్గొన్నాననే కారణంతో పోలీసులు తన ఇంటిపై దాడి చేసి సోదాలు చేశారని కాంగ్రెస్ పార్టీ నాయకురాలు ఉష వాపోయారు.

అందరి సహకారంతో విజయం సాధిస్తా



నరసింహన్ కన్నన్, బోర్డు మాజీ ఉపాధ్యక్షుడు వి. జైప్రకాష్‌ను కలిసిన వెన్నెల

రసూల్‌పురా: కంటోన్మెంట్ నియోజకవర్గంలో పార్టీకి చెందిన సీనియర్ నాయకుల నుంచి కార్యకర్త వరకు అందరి సహకారంతో ఎన్నికల్లో విజయం సాధిస్తానని కంటోన్మెంట్ కాంగ్రెస్ అభ్యర్థి వెన్నెల పేర్కొన్నారు. కంటోన్మెంట్ టికెట్ ఆశించిన ఎస్సీసెల్ నగర ప్రధాన కార్యదర్శి నరసింహన్ కన్నన్ బొల్లారంలోని తన పార్టీ కార్యాలయంలో, అదేవిధంగా బోర్డు మాజీ ఉపాధ్యక్షులు వి. జయప్రకాష్‌ను తన నివాసంలో, పార్టీ సీనియర్ నాయకులు ప్యారసాని రామ్‌కుమార్, పీసీసీ ఆర్గనైజింగ్ సెక్రటరి బల్వంత్‌రెడ్డి ఇతర నాయకులను వెన్నెల మర్యాదపూర్వకంగా కలిశారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ.. కంటోన్మెంట్ ప్రజలతో తనకు తన తండ్రి గద్దర్‌కు మంచి అనుబంధం ఉందని కంటోన్మెంట్‌లోని ప్రజా సమస్యలపై తనకు అవగాహన ఉందన్నారు. ఈ సందర్భంగా జయప్రకాష్, నరసింహన్, రామ్‌కుమార్ తదితరులు కంటోన్మెంట్‌లో కాంగ్రెస్ పార్టీ విజయానికి తన వంతు సహకారం అందజేస్తామని హామీ ఇచ్చారు. ఈ కార్యక్రమంలో గజ్జెల భరత్, బంగారు సదానంద్, అన్నానగర్ మురళి, యాదగిరి పాల్గొన్నారు.

కంటోన్మెంట్‌లో బీజేపీ జెండా ఎగరవేస్తాం


ఎన్నికల ప్రచారం నిర్వహిస్తున్న బీజేపీ నాయకులు

రసూల్‌పురా: కంటోన్మెంట్ నియోజకవర్గంలో బీజేపీ జెండా ఎగరవేస్తామని ఆ పార్టీ రాష్ట్ర నాయకులు వర్రీ తులసి విజయ్‌కుమార్ ధీమా వ్యక్తం చేశారు. రెండవ వార్డు ఇందిరమ్మనగర్, పోచమ్మ టెంపుల్ లేన్, బీరప్ప టెంపుల్ బస్తీల్లో శనివారం ఎన్నికల ప్రచారం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. కంటోన్మెంట్ నియోజకవర్గంలో కేంద్ర ప్రభుత్వం ఆదేశాలతో టోల్‌ట్యాక్స్ ఎత్తివేశామని, స్లమ్ ఏరియాలు, బస్తీల్లో వంద గజాల్లో ఇంటి నిర్మాణాలకు అనుమతులు, వర్కింగ్ ఉమెన్స్ హాస్టల్ నిర్మాణం, బొల్లారం హాస్పిటల్‌లో కనీస వసతులు తదితర అభివృద్ధి పనులు చేపట్టామన్నారు. ఈ కార్యక్రమంలో అశోక్‌కుమార్, మమత, రేఖ, జైయాదవ్, ప్రశాంత్, శ్యామ్ పాల్గొన్నారు.

- ఏడో వార్డు సెంట్రల్ బస్త్రీ బస్తీలో బీజేపీ నాయకురాలు డాక్టర్ సుష్మీత శంకర్రావు ఎన్నికల ప్రచారం నిర్వహించి ప్రజల సమస్యలు అడిగి తెలుసుకున్నారు. డ్రైనేజీ, తాగునీటి సమస్యలు పరిష్కరించాలని స్థానికులు కోరగా ఈ సారి జరిగే ఎన్నికల్లో బీజేపీని గెలిపిస్తే సమస్యలు పరిష్కారమవుతాయన్నారు. ఈ కార్యక్రమంలో ప్రశాంత్ ప్రభు, సుధీర్, మంజుల పాల్గొన్నారు.

బీఆర్ఎస్‌కు గుణపాఠం తప్పదు

బౌద్ధనగర్: పార్శిగుట్టను దత్తత తీసుకున్న కేసీఆర్ ఎలాంటి అభివృద్ధి పనులు చేయలేదని బీజేపీ నాయకురాలు మేకల కీర్తి ఆరోపించారు. బౌద్ధనగర్ డివిజన్ బీజేపీ అధ్యక్షుడు హనుమంతు ముదిరాజ్ ఆధ్వర్యంలో శనివారం అంబర్‌నగర్‌లో పాదయాత్ర నిర్వహించారు. ప్రధాని నరేంద్ర మోదీ తొమ్మిదేళ్ల పరిపాలన గురించి ఇంటింటికీ తిరిగి వివరించారు. ఈ సందర్భంగా పలువురు మాట్లాడుతూ.. మోసపూరిత మాటలతో రెండు సార్లు అధికారంలోకి వచ్చిన బీఆర్ఎస్‌కు ఈసారి ప్రజలు బుద్ధి చెబుతారన్నారు. పేదలకు డబుల్ బెడ్రూమ్ ఇవ్వలేదని, రేషన్ కార్డులు కూడా మంజూరు చేయలేదన్నారు. డివిజన్‌లో నాలా వెడల్పు కూడా చేయలేదని ఆరోపించారు. అవినీతి అక్రమ పాలనతో ప్రజలు విసిగిపోయారన్నారు. స్థానిక ప్రజల సమస్యలను పరిష్కరించడంలో పద్మారావుగౌడ్ విఫలమయ్యారన్నారు. ఈ ఎన్నికల్లో పద్మారావుగౌడ్‌ను ఓడించి బీజేపీ అభ్యర్థిని గెలిపించాలని కోరారు. ఈ పాదయాత్రలో సత్యనారాయణ, శ్యామ్ రాజ్, వనమాల శ్రీను, విశ్వనాథ్, అశోక్, ప్రకాష్, సత్తి పాల్గొన్నారు.

కంటోన్మెంట్ అభివృద్ధికి కృషిచేస్తా


పాదయాత్రలో కుట్టు మిషన్ కుడుతున్న లాస్య నందిత

రాంగోపాల్‌పేట్: కంటోన్మెంట్ నియోజకవర్గంలో పాదయాత్రలో ఎక్కడికి వెళ్లినా అడుగడుగునా ప్రజలు అక్కున చేర్చుకుని ఆశీర్వదిస్తుండటం మరిచిపోలేని అనుభూతిని ఇస్తుందని బీఆర్ఎస్ అభ్యర్థి లాస్యనందిత అన్నారు. శనివారం మోండా మార్కెట్ డివిజన్‌లోని సెకండ్ బజార్, చాపలబావి, శివాజీనగర్ తదితర ప్రాంతాల్లో ఆమె పాదయాత్ర చేస్తూ మాట్లాడారు. ప్రజలు ఆశీర్వదించి విజయాన్ని అందిస్తే ముఖ్యమంత్రి కేసీఆర్, మంత్రి కేటీఆర్ సహకారంతో నియోజకవర్గ అభివృద్ధి కోసం శక్తివంచన లేకుండా కృషి చేస్తా అన్నారు. ప్రతిపక్షాలు చెప్పే మాయా మాటలు విని మోసపోవద్దని కంటోన్మెంట్ మరింత అభివృద్ధి చెందాలంటే బీఆర్ఎస్ పార్టీని గెలిపించాలని కోరారు. ప్రచారంలో రూప, నరసింహారావు, టీఎన్ శ్రీనివాస్, హరికృష్ణ, చిన్న, అజయ్, శేఖర్ ముదిరాజ్, గౌరిశంకర్, నవీన్, సుజన్ ముదిరాజ్, నివేదిత, సువర్ణ, అనిత పాల్గొన్నారు.

ఓటు వేయగానే మెసేజ్ రావాలి

లాలాపేట: ఓటు వేసిన వెంటనే సదరు వ్యక్తి సెల్‌ఫోన్‌కు 'ధన్యవాదాలు ఓటు హక్కు వినియోగించుకున్నందుకు' అని మెసేజ్ వచ్చేలా ఏర్పాట్లు చేయాలని యువత కోరుతున్నారు. ప్రస్తుతం టెక్నా లజీ పెరిగిపోయిందని బ్యాంక్ లావాదేవీలతో పాటు గూగుల్, ఫోన్‌పే, పేటీఎం ఏపీ ఉపయోగించినా వెంటనే ఆ వ్యక్తి నెంబర్‌కు మెసేజ్ వస్తుంది. విద్యార్థుల నుంచి వృద్ధుల వరకు సెల్ నెంబర్‌కు ఓటీపీ వస్తేనే పని అవుతుంది. కానీ ఎంతో విలువైన ఓటు హక్కు వినియోగించే విషయంలో మెసేజ్‌ను పంపే టెక్నాలజీని ఎందుకు అమలు చేయడం లేదంటున్నారు. ఈవీఎంలో ఓటు వేసేటప్పుడు బటన్ నొక్కగానే ఓ శబ్దం వస్తుంది. అయినా ఏదో ఒక అసంతృప్తి..మనం ఓటు వేశామా..అనే సందేహం ఉంటుంది. ఆ సందేహాన్ని నివృత్తి చేసేందుకు ఇలా చేస్తే తాము ఓటు వేశా మని సంతృప్తి ఉంటుందని అంటున్నారు.

దాసారం బస్తీ హత్యకేసులో నలుగురి రిమాండ్

పరారీలో మరో ఇద్దరు


షరీఫ్‌ను రిమాండ్‌కు తరలిస్తున్న పోలీసులు

అమీర్‌పేట: దాసారం బస్తీలో జరిగిన హత్య కేసులో రౌడీషీటర్‌తో పాటు మరో ముగ్గురిని రిమాండ్‌కు తరలించారు. పాత కక్షల నేపథ్యంలోనే హత్య జరిగినట్లు పోలీసులు తెలిపారు. కళాశాలలో చదువుతున్న సమయంలో ఇద్దరికి తరుచూ గొడవలు జరిగేవని, ఇటీవల తరుణ్ ఆధిపత్యం పెరిగిపోవడాన్ని షరీఫ్ జీర్ణించుకోలేక తరుణ్‌పై ఆగ్రహంతో ఉన్న షరీఫ్ అదను కోసం వేచి చూస్తున్నాడు. దసరా రోజు దాసారం బస్తీ మైదానంలో రావణ దహనం ఉండడంతో షరీఫ్ తన అనుచరులతో కలిసి అక్కడి చేరుకున్నాడు. కార్యక్రమంలో పూర్తయ్యాక అందరూ ఇళ్లకు వెళ్లిపోయిన తర్వాత మద్యం, గంజాయి తాగుతూ అక్కడే కూర్చున్నారు. తరుణ్‌కు స్నేహితుడి ద్వారా సమాచారం ఇచ్చి అక్కడికి పిలిపించారు. అందరు కలిసి మద్యం తాగుతుండగా ఇద్దరు నడుమ మళ్లీ గొడవ ప్రారంభమైంది. ముందుగా షరీఫ్, అతడి అనుచరులు తరుణ్‌ను కొట్టడంతో అక్కడి నుండి వెళ్లిపోయి జరిగిన విషయాన్ని స్నేహితుడితో చెప్పాడు. ఇరువురు కలిసి తిరిగి దాసారం బస్తీ మైదానంలోకి వచ్చి రాగానే రాయితో షరీఫ్‌ను కొట్టాడు. దీంతో షరీఫ్ అనుచరులైన రాహుల్,అభిషేక్,నాగరాజుతో కలిసి బండ రాళ్లతో తరుణ్‌పై దాడికి తెగబడ్డారు. విషయం తెలుసుకుని అక్కడి వచ్చిన పోలీసులు తీవ్ర గాయాలైన తరుణ్ ఆసుపత్రికి తరలించగా అప్పటికే మృతి చెందినట్లు వైద్యులు నిర్ధారించారు. తరుణ్ తండ్రి జతావత్ రూప్‌సింగ్ ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసిన పోలీసులు విచారణ జరిపి హత్యలో ఆరుగురు పాల్గొన్నట్లు గుర్తించారు. రౌడీ షీటర్ షరీఫ్, రాహుల్, అభిషేక్, నాగరాజును రిమాండ్‌కు తరలించగా మరో ఇద్దరు పరారీలో ఉన్నట్లు ఇన్‌స్పెక్టర్ రాం ప్రసాదరావు తెలిపారు.

ఫిర్యాదుదారులను బెదిరించిన ఘటనలో ఐదుగురు..

కంటోన్మెంట్: ఫిర్యాదుదారులను బెదిరించిన కేసులో ఐదుగురిని రిమాండ్‌కు తరలించారు. నార్త్ జోన్ డీసీపీ చందనా దీప్తి వెల్లడించిన వివరాల ప్రకారం.. మారేడుపల్లికి చెందిన సన్నీ యాదవ్‌పై గత జూన్‌లో సందీప్ ఫిర్యాదు మేరకు కేసు నమోదై రిమాండ్‌కు తరలించారు. తాజాగా సన్నీ యాదవ్, మారేడుపల్లికి చెందిన గొల్ల కిట్టు, విశ్వేందర్, రవీందర్ రెడ్డి, చంద్రప్రభు, వీరబాబులతో కలిసి సందీప్‌తో పాటు అతని మిత్రుడు అజయ్‌ను కిడ్నాప్ చేశారు.గతంలో సన్నీయాదవ్‌పై పెట్టిన కేసును వెనక్కి తీసుకోవాలని ఒత్తిడి చేయడంతో పాటు ఇద్దరిపై దాడి చేశారు. కేసు వెనక్కి తీసుకోకుంటే చంపేస్తామని బెదిరించారు. బాధితుల ఫిర్యాదు మేరకు ఐదుగురిని రిమాండ్‌కు తరలించారు.


నిందితుల వివరాలు వెల్లడిస్తున్న చందనా దీప్తి

మర్రి ఆదిత్యకు టికెట్ ఇవ్వాలి

సనత్‌నగర్: కాంగ్రెస్ పార్టీ సనత్‌నగర్ నియోజకవర్గ ఎమ్మెల్యే అభ్యర్థి కోట నీలిమ పేరును ప్రకటించటం పట్ల కార్యకర్తలు అసంతృప్తితో ఉన్నారని, గ్రేటర్ హైదరాబాద్ కాంగ్రెస్ కమిటీ మాజీ ఉపాధ్యక్షుడు ఇబ్రహీం పటేల్ అన్నారు. బేగంపేటలోని ఆయన నివాసంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. సనత్‌నగర్ నియోజకవర్గానికి ఏ మాత్రం పరిచయం లేని ఓ మహిళను కాంగ్రెస్ అభ్యర్థిగా ప్రకటించటంతో ఎన్నికల ప్రచారానికి రాలేకపోతున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. అభ్యర్థిగా ఖరారైన తర్వాత అందరిని కలుపుకొని పోవాల్సిన ఆమె సొంత నిర్ణయాలు తీసుకుంటూ ప్రచారం చేయటం ద్వారా పార్టీకి నష్టం జరుగుతుందన్నారు. నియోజకవర్గంలో ఎంతో పేరున్న మర్రి ఆదిత్యకు టికెట్ ఇస్తే కార్యకర్తలంతా ఒక తాటిపైకి వచ్చి ఆయన విజయానికి కృషి చేస్తామన్నారు. ఇదే విషయంపై త్వరలో తామంతా రేవంత్‌రెడ్డిని కలవనున్నట్లు తెలిపారు.

కాంగ్రెస్ జెండా ఎగరడం ఖాయం


తనకు ఓటేయాలని కోరుతున్న ఆదం సంతోష్‌కుమార్

బౌద్ధనగర్: బీఆర్ఎస్ పాలనలో విసిగిపోయిన ప్రజలు మార్పు కోరుకుంటున్నారని కాంగ్రెస్ పార్టీ అభ్యర్థి ఆదం సంతోష్ కుమార్ పేర్కొన్నారు. ఎన్నికల ప్రచారంలో భాగంగా శనివారం ఆయన వారాసిగూడలోని కౌసర్ మసీద్ వద్ద ప్రచారం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆదం సంతోష్ మాట్లాడుతూ.. సికింద్రాబాద్‌లో కాంగ్రెస్ జెండా ఎగరడం ఖాయమని ధీమా వ్యక్తం చేశారు. పద్మారావుగౌడ్ అధికారంలో ఉన్నప్పుడు ప్రజల సమస్యలు పట్టించుకోలేదని అందువల్ల ఈ సారి ప్రత్యామ్నాయ పార్టీ అయిన కాంగ్రెస్‌ను గెలిపించుకునేందుకు ప్రజలు సిద్ధంగా ఉన్నారని తెలిపారు. కౌసర్ మసీదు వద్ద ముస్లిం సోదరులను కలిసి తనను గెలిపించాలని కోరారు.

మామకు మద్దతుగా కోడళ్ల ప్రచారం



లాలాపేట: డిప్యూటీ స్పీకర్ పద్మారావు గౌడ్ శనివారం తార్నాక డివిజన్ లాలాపేటలో నిర్వహించిన ఎన్నికల ప్రచారంలో ఆయన కోడళ్లు పాల్గొన్నారు. ప్రచారంలో పార్టీ శ్రేణులతో కలిసి ఇంటింటికి వెళ్లి కారు గుర్తుకు ఓటేసి మూడో సారి తమ మామ పద్మారావు గౌడ్‌ను గెలిపించాలని కోరారు. పద్మారావు తనయుడు రామేశ్వర్‌గౌడ్ పెళ్లి రోజును పురస్కరించుకుని ప్రచార కార్యక్రమంలోనే బీఆర్ఎస్ శ్రేణుల నడుమ వారు కేక్‌కట్ చేసి అందరికీ పంచిపెట్టారు.

యువతిని వేధిస్తున్న వ్యక్తిపై కేసు

అమీర్‌పేట: యువతిని వేధిస్తున్న ఓ యువకుడిపై ఎస్ఆర్‌నగర్ పోలీసులు కేసు నమోదు చేశారు. ఇన్‌స్పెక్టర్ పి.వి. రాంప్రసాదరావు వివరాల ప్రకారం.. ఫిరోజ్‌గూడ ప్రాంతానికి చెందిన ఓ యువతి (20) ఎస్ఆర్‌నగర్‌లోని ఓ బ్యాంకులో పని చేస్తోంది. ఆమెకు అల్వాల్‌కు చెందిన అజయ్‌కుమార్ (22)తో చాలా ఏళ్లుగా పరిచయం ఉంది. ఇటీవల యువతిపై అనుమానంతో తరుచూ వేధించేవాడు. వేరే వ్యక్తితో చనువుగా ఉంటున్నట్లు మీ ఇంట్లో వారికి చెబుతానని, ఇద్దరు కలిసి దిగిన ఫొటోలు ఇతరులకు చూపిస్తానని బెదిరిస్తున్నాడు. శుక్రవారం యువతి పనిచేస్తున్న బ్యాంకు వద్దకు వెళ్లి గొడవకు చేయడంతో యువతి ఎస్ఆర్‌నగర్ పోలీసులకు ఫిర్యాదు చేయగా కేసు నమోదు చేశారు.

కేంద్ర పథకాలు సద్వినియోగం చేసుకోవాలి


దూద్‌బావిలో ప్రచారం చేస్తున్న బీజేపీ నాయకులు

చిలకలగూడ: బడుగు, బలహీన వర్గాల సంక్షేమం, మహిళా అభ్యున్నతికి కేంద్ర ప్రభుత్వం ప్రవేశపెట్టిన సంక్షేమ పథకాలను సద్వినియోగం చేసుకోవాలని బీజేపీ నాయకులు సూచించారు. బీజేపీ జిల్లా ఎస్సీ మోర్చా, కిషాన్ మోర్చా ఉపాధ్యక్షులు నరేష్‌మాదిగ, దేవుడుకుమార్ ఆధ్వర్యంలో మెట్టుగూడ డివిజన్ దూద్‌బావి బస్తీలో శనివారం ఇంటింటికి కరపత్రాలు పంచుతూ ఎన్నికల ప్రచారం నిర్వహించారు. రానున్న అసెంబ్లీ ఎన్నికల్లో బీజేపీ విజయం సాధించాలని కోరుతూ స్థానిక కాశీ విశ్వేశ్వర దేవాలయంలో ప్రత్యేక పూజలు నిర్వహించారు. ప్రచారంలో మహేష్, నాగలక్ష్మీ, నాగేష్, అనూష, అనంతలక్ష్మీ, సరిత, సతీష్, సిద్ధప్ప, రాజేష్, రవితేజ పాల్గొన్నారు.

ఎస్సీ వర్గీకరణతోనే మాదిగల జీవితాల్లో వెలుగు


మాట్లాడుతున్న నర్సయ్య మాదిగ

బన్సీలాల్‌పేట్: ఎస్సీ వర్గీకరణ ద్వారానే మాదిగల జీవితాల్లో వెలుగు చూడగలమని ఎమ్మెస్పీ హైదరాబాద్ జిల్లా ఇన్‌చార్జి నర్సయ్య, ఎమ్మార్పీఎస్ హైదరాబాద్ జిల్లా ఇన్‌చార్జి ఉపేందర్, జిల్లా కన్వీనర్ గణేష్, మల్లికార్జున్, ప్రభాకర్, కుమార్‌బాబు, వాసు పేర్కొన్నారు. బన్సీలాల్‌పేట్ డివిజన్ చాచానెహ్రూనగర్‌లో శనివారం ఏర్పాటు చేసిన ఎమ్మార్పీఎస్, ఎమ్మెస్పీ సమావేశంలో పలువురు మాట్లాడారు. మంద కృష్ణ మాదిగ నాయకత్వంలో ఎమ్మార్పీఎస్ ఎస్సీ వర్గీకరణ కోసం సుమారు 28 సంవత్సరాల నుంచి అనేక పోరాటాలు, ఆందోళనలు, ఉద్యమాలు చేస్తున్నదని చెప్పారు. అవకాశవాద రాజకీయ పార్టీలు ఎస్సీ వర్గీకరణ కోసం హామీ ఇస్తూ విస్మరిస్తున్నారని ఆరోపించారు. నవంబర్ 18న నిర్వహించే మాదిగల విశ్వరూప మహాసభను విజయవంతం చేయడానికి మాదిగలు పెద్ద ఎత్తున తరలిరావాలని పిలుపునిచ్చారు. ఈ నెల 31న బన్సీలాల్‌పేట్ డివిజన్ చాచానెహ్రూనగర్‌లో పెద్ద ఎత్తున మాదిగల విశ్వరూప మహాసభ సన్నాహక సమావేశాన్ని నిర్వహిస్తున్నట్లు చెప్పారు. నరసింహ, కుమార్ బాబు, గజ్జెల రాజశేఖర్, వుజోల్ల రవి పాల్గొన్నారు.